క్లుప్తంగా

ఘనంగా నేతాజీ జయంతి



ఐనవోలు : మండల కేంద్రంలో సేవాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. చంద్రబోస్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవాభారతి అధ్యక్షుడు తండా అశోక్ మాట్లాడారు. నేతాజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అమరవాది చేరాలు, ఆరే సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు గుండెకారి కోటేశ్వర్, బీసీ నాయకుడు అమరవాది సారంగపాణి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, భిక్షపతి పాల్గొన్నారు.

12 లీటర్ల నాటుసారా పట్టివేత



శాయంపేట : అక్రమంగా తరలిస్తున్న 12 లీటర్ల నాటుసారాతోపాటు నిందితుడి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్టు పరకాల ఎక్సైజ్ సీఐ జగన్నాథరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని సూర్యనాయక్ తండా నుంచి నాటుసారా తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు ఆ తండా శివారులో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనంలో నాటుసారాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అజ్మీర రమేష్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ వివరించారు. దాడిలో ఎక్సైజ్ ఎస్సై పద్మ, సిబ్బంది సత్తయ్య, రవీందర్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



కమలాపూర్ : మండల కేంద్రంలో నివాసం ఉంటున్న నేపాల్‌కు చెందిన వివాహిత పవిత్ర (29) అదృశ్యమైనట్లు ఎస్సై సతీష్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నేపాల్‌కు చెందిన బహదూర్ మోగర్, అతడి భార్య పవిత్ర కలిసి సుమారు ఏడాదిగా మండల కేంద్రంలో నివాసం ఉంటూ స్పైసీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 19న బహదూర్ పనికి వెళ్లి రాత్రి 10 గంటల సమయంలో వచ్చే సరికి ఇంట్లో పవిత్ర కనిపించలేదు. ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతోపాటు ఇంట్లో పవిత్రకు సంబంధించిన దుస్తులు, ఇతర వస్తువులు కనిపించలేదు. పవిత్ర ఆచూకీ కోసం వరంగల్‌లో ఉన్న బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో పవిత్ర భర్త బహదూర్ మోగర్ ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



ఎల్కతుర్తి : మండలంలోని వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన బీజేవైఎం నాయకుడు మండ వరప్రసాద్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతడి కుటుంబానికి బీజేపీ నాయకుడు జన్నారపు సురేందర్‌రెడ్డి సోమవారం క్వింటా బియ్యం అందజేశారు. వరప్రసాద్ కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

పరకాల : పరకాల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 26 వాహనాలను ఈనెల 24న (మంగళవారం) స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ రూరల్ డీపీఈఓ లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షణలో ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 7న సర్వసభ్య సమావేశం

శాయంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫిబ్రవరి 7న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరౌతారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

సమన్వయంతో అభివృద్ధి సాధ్యం

ఎంపీపీ మార్నేని మధుమతి

- 2.30 గంటల ఆలస్యంగా సర్వసభ్య సమావేశం
- ఓట్ ఆఫ్ థ్యాంక్స్ చెప్పకుండానే ముగింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మార్నేని మధుమతి

ఐనవోలు : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమౌతుందని ఎంపీపీ మార్నేని మధుమతి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం 2.30 గంటల ఆలస్యంగా మొదలైంది. చివరకు ఓట్ ఆఫ్ థ్యాంక్స్ చెప్పకుండానే సమావేశాన్ని ముగించారు. సమావేశానికి ఎంపీపీ మధుమతి అధ్యక్షత వహించగా తొలుత ప్రభుత్వ శాఖల అధికారులు గడచిన మూడు నెలల ప్రగతి నివేదికను వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపార విస్తరణకు మహిళా సంఘాల్లో సభ్యులకు 34 శాతం సబ్సిడీతో రూ.5–10 లక్షల రుణం ఇస్తోందని ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ తెలిపారు.ఇప్పటివరకు సంబంధిత వివరాలను సర్పంచ్‌లకు ఎందుకు చెప్పలేదంటూ గర్మిళ్లపల్లి సర్పంచ్ గండి మల్లికాంబ నిలదీశారు. స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించినా లోన్ ఖాతాలో నిధులు ఎందుకు జమ ఎందుకు కావడం లేదని ప్రశ్నించారు. లోన్ చెల్లించిన మహిళలకు రశీదు ఇవ్వకపోవడానికి కారణం ఏంటని స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌ను ఎంపీపీ నిలదీశారు. రుణాలు తిరిగి చెల్లించినా కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్లు వస్తుండడంతో కుటుంబాల్లో కలతలు చోటు చేసుకుంటున్నాయని కక్కిరాలపల్లి సర్పంచ్ కంజర్ల రమేష్ తెలిపారు. అనంతరం ఏఎం సంతోష్ సమాధానం ఇచ్చారు. మండలంలో 36 వీఓలు ఉండగా 8 వీఓల్లో స్త్రీనిధి నిధులు జమ కాలేదని ఫిర్యాదులు రాగా శాఖాపరమైన విచారణ చేపట్టామన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో సీఏలు రుణాలు ఇప్పిస్తే గ్రూపుల వద్ద లక్షకు రూ.500లు కమీషన్ తీసుకుంటున్నారని గర్మిళ్లపెల్లి సర్పంచ్ మల్లికాంబ ఆరోపించగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే డీఆర్‌డీఏ పీడీ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీపీ తెలిపారు. విద్యుత్ ఏసీడీపై పెరుమాండ్లగూడెం సర్పంచ్ పిడుగు రజిత అసహనం వ్యక్తం చేశారు. కంటివెలుగు విజయవంతం అయ్యేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ కోరారు. ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న క్రమంలో ఆసక్తి కలిగిన రైతులు సంప్రదించాలని హార్టీకల్చర్ ఆఫీసర్ మానస కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్నేని మధుమతి మాట్లాడారు. ప్రభుత్వ శాఖల ద్వారా నిర్వహించే సమావేశాలకు ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. సమావేశంలో 22 అజెండా అంశాల్లో 18 అంశాలను 100 నిమిషాల్లో చర్చించి మమ అనిపించారు.

రెండున్నర గంటల ఆలస్యం

సర్వసభ్య సమావేశంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా రెండున్నర గంటల పాటు ఆలస్యంగా మొదలైంది. సమావేశానికి కక్కిరాలపల్లి, ఒంటిమామిడిపల్లి ఎంపీటీసీలు తాటికాయల రమేష్, కడుదూరి రాజు హాజరు కాగా మిగతా ఎంపీటీసీలు రైతువేదిక బయటే ఉండి నిరసన తెలిపారు. సమావేశానికి రావాలని ఎంపీపీ, ఎంపీడీఓ పలుమార్లు కోరగా అధికారులు సమావేశాల సమాచారం ఇవ్వకుండా అగౌరవపర్చుతున్నారని ఎంపీటీసీలు వాపోయారు. చివరకు ఎంపీపీ నచ్చజెప్పడంతో ఎంపీటీసీలు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం



ఎల్కతుర్తి : చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే



భీమదేవరపల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎల్కతుర్తి : పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. సమైక్య పాలనలో పేదలు ఆడపిల్లల వివాహం కోసం అప్పు చేయాల్సి వచ్చేదని, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అధికారం చేపట్టాక కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలోనూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న కార్యక్రమాలను పేదలు వినియోగించుకుని లబ్ధి పొందాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సునీత, ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ పోరెడ్డి రవీందర్‌రెడ్డి, సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, రైల్వే బోర్డు మెంబర్ ఎల్తూరి స్వామి, నాయకులు గొడిశాల సమ్మయ్య గౌడ్, బూర్గుల రామారావు, తంగెడ మహేందర్, గొల్లె మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే సతీష్‌కుమార్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ నిర్వాసితులతో కలిసి ప్రాజెక్ట్ పనులను అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. అయినా నిర్వాసితుల మద్దతుతోనే ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్‌లు మాడ్గుల కొమురయ్య, గూడెల్లి రాజిరెడ్డి, మండల సురేందర్, మార్పాటి మహేందర్‌రెడ్డి, దార్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా పనిచేస్తే సక్సెస్ ఖాయం

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : ప్రణాళికాయుతంగా పని చేస్తే సక్సెస్ ఖాయమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. వేలేరు మండల కేంద్రంలోని, ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామంలోని కంటి వెలుగు శిబిరాలను సోమవారం ఆయన సందర్శించి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. వైద్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రణాళికాయుతంగా పని చేయాలని చెప్పారు. తద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, వైద్యాధికారులు ఆనంద్‌కుమార్, గీతారాణి, గోపీనాథ్, సర్పంచ్‌లు కాయిత మాధవరెడ్డి, కర్ర సోమిరెడ్డి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం : సీడీపీఓ



పరకాల : ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు



దామెర : ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



కమలాపూర్ : మాట్లాడుతున్న దామోదర్

పరకాల : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పరకాల ప్రాజెక్ట్ సీడీపీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల హైస్కూల్ విద్యార్థినులకు బాల్యవివాహాలు, పోషకాహారంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ భాగ్యలక్ష్మి మాట్లాడారు. 18 ఏళ్ల లోపు వయస్కులైన బాలికలకు వివాహం చేయడం సరికాదన్నారు. బాల్యవివాహాలను ప్రభుత్వం నిషేధించిందని గుర్తు చేశారు. బాల్యవివాహాలు జరిపిస్తే రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, బాధ్యులకు చట్టపరమైన శిక్ష తప్పదని హెచ్చరించారు. ఆడపిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.హేమలత, అంగన్‌వాడీ, స్కూల్ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి మాట్లాడారు. ఆడపిల్లల రక్షణ కోసం చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వరి, ప్రభాసిని, అంగన్‌వాడీ టీచర్లు కోమల, వజన, రమ. తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : భీమదేవరపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో 'ఆడపిల్లను రక్షిద్దాం.. ఆడపిల్లను చదివిద్దాం' అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో బాలల సంక్షేమ సమితి సభ్యుడు దామోదర్ మాట్లాడారు. సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, సామాజిక పరిస్థితులపై బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్పంచ్ విజయ మాట్లాడుతూ ఆడపిల్లలకు మగపిల్లలతో సమానమైన హక్కులున్నాయని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ స్వరూప మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రహ్లాదేవి, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శిరీష, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శారద, కోమల, పద్మ, పద్మకుమారి, పూర్ణిమ, ఉమ, శ్రీలత, రజిత, తిరుమల, అంకూస్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కుల రక్షణే ధ్యేయం



పరకాల : డైరీ ఆవిష్కరిస్తున్న రమాదేవి, శ్రీహరి

పరకాల : ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణే పీఆర్టీయూ ధ్యేయమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పలీత శ్రీహరి తెలిపారు. పట్టణంలోని బాలుర జెడ్పీ హైస్కూల్‌లో ఆ సంఘం 2023 సంవత్సర డైరీని సోమవారం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం మండల అధ్యక్షుడు మోడెం రాజేందర్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంఈఓ ఎస్.రమాదేవి, శ్రీహరి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అన్యాయం జరుగకుండా చూస్తామన్నారు. సమావేశంలో పరకాల మండల శాఖ ప్రధాన కార్యదర్శి గొల్ల రాజ్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, దగ్గు తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి డి.రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీధర్, మండల అసోసియేట్ అధ్యక్షుడు కె.శశికళాధర్, కార్యదర్శి ఎస్.బాలకోటయ్య, ఉపాధ్యక్షురాలు మణెమ్మ పాల్గొన్నారు.

ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో పీఆర్టీయూ టీఎస్ 2023 సంవత్సర డైరీని యూనియన్ మండల అధ్యక్షుడు వెన్నం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఝెుర్ర తిరుపతి ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించి సభ్యులకు, ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీల్లో అర్హులకు అవకాశం కల్పిస్తూ జీరో స్టాండింగ్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలు చెల్లించాలని, పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు మన్మోహన్, సారయ్య యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీను, విద్యానంద్, నాయకులు ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, హున్యానాయక్, లీలారాణి, వెంకటేశ్వర్లు, స్వరూప, వేలేరు హెచ్ఎం నాగకుమారి, లీలాబాయి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో బీసీలకు అన్యాయం

ఆత్మకూరు : బీఆర్ఎస్ పాలనలో బీసీ కులాలకు అన్యాయం జరుగుతోందని ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక బీసీలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పేద దళితులందరికీ దళితబంధు పథకంతోపాటు ఇంటి స్థలం ఇచ్చి రూ.5 లక్షలతో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టించాలని, బీసీలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం'

నడికూడ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని మాజీ మంత్రి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి ప్రజాదరణ పెరుగుతోందని చెప్పారు. అనంతరం మండలంలోని రామకృష్ణాపూర్, కంఠాత్మకూర్, కౌకొండ, సర్వాపూర్ గ్రామాల్లో బీజేపీ జెండాలు ఆవిష్కరించారు.

నేడు మార్కండేయ జయంతి

శాయంపేట: మండల కేంద్రంలోని శివ మార్కండేయ, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24న (మంగళవారం) భక్త మార్కండేయ జయంతి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, శివలింగానికి, మార్కండేయ స్వామికి పంచామృత అభిషేకాలు, వైభవ వత్రం, మృత్యుంజయ హవనం, అన్నదానం ఉంటాయని పేర్కొన్నారు. సాయంత్రం శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్‌కు పలువురి పరామర్శ



ఐనవోలు : పరామర్శిస్తున్న సీఈఓ చిన్నారావు



దామెర : నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఐనవోలు : డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును సోమవారం పలువురు పరామర్శించారు. వరంగల్ డీసీసీ బ్యాంక్ సీఈఓ చిన్నారావు, గీసుగొండ, వంచనగిరి సొసైటీ చైర్మన్‌లు రడం శ్రీధర్, కొల్లూరి రవీందర్, మైనార్టీ నేత నయీముద్దీన్, డీడబ్ల్యూఎస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రాజ్‌మహ్మద్ తదితరులు వేర్వేరుగా పరామర్శించారు.

ఆత్మకూరు : డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును ఐనవోలు మండల కేంద్రంలోని నివాసంలో ఆత్మకూరు పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రవీందర్‌గౌడ్ వెంట రమేష్‌గౌడ్, మురళీధర్, దామోదర్‌రెడ్డి ఉన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు..

దామెర : మండలంలోని ఊరుగొండకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజును అతడి తాత బుచ్చిరెడ్డి ఇటీవల మృతి చెందిన సందర్భంగా రెడ్డి జేఏసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ గోపు జయపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. తొలుత బుచ్చిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుబుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట నర్సంపేట్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంది గోపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నంద్యాల కృష్ణారెడ్డి, దాసరి కేశవరెడ్డి, గోలి చొక్కారెడ్డి, నాగెల్లి కేశవరెడ్డి, దాసరి జయేందర్‌రెడ్డి, వీసం రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఏసీడీ చార్జీలతో ప్రజలపై భారం



కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ చార్జీలు విధిస్తూ భారం మోపుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి విమర్శించారు. ఏసీడీ చార్జీలు వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కూడలి వద్ద హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై సోమవారం బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రం విద్యుత్ రంగంలో దేశానికే ఆదర్శమని సీఎం కేసీఆర్ ఊదరగొడుతూనే రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వకపోగా ప్రజలపై భారం మోపేలా ఇప్పటికే పలుమార్లు విద్యుత్ చార్జీలు పెంచారని తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మాటం రమేష్‌బాబు, బీజేపీ నాయకులు తుమ్మ శోభన్‌బాబు, భూపతి ప్రవీణ్, సరిగె ఓదెలు, నాసని రాజు, ర్యాకం శ్రీనివాస్, ఏలిమి మహాజన్, కొలిపాక తిరుపతి, సంపత్, తిరుపతిరెడ్డి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చే వరకు పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న తోట భిక్షపతి

శాయంపేట : ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసిన ప్రతి ఒక్కరికీ పట్టాలిచ్చే వరకు పోరాటాలు కొనసాగిస్తామని గుడిసెవాసుల సంఘం జిలా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని సర్వే నెంబర్ 633లోని ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసిన క్రమంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములను భూకబ్జాదారులు ఆక్రమిస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. పార్టీ ఆధ్వర్యంలో పేదలకు లక్షలాది ఎకరాలు భూపంపిణీ చేసినట్టు తెలిపారు. సర్వే నెంబర్ 633లోని భూమిలో పేదలకు పట్టాలిచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో బీఎస్ఎస్ నాయకుడు మారెపల్లి క్రాంతికుమార్, సీపీఎం నాయకుడు అనుకారి అశోక్, ఎమ్మార్పీఎస్ నాయకుడు అరికిళ్ల దేవయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల భాస్కర్, మారపల్లి రవీందర్, బహుజన నాయకులు మొగ్గం సుమన్, ఎంఎఫ్‌సీ నాయకులు సదయ్య, మహిళా నాయకురాలు రమాదేవి పాల్గొన్నారు.

పాలకవర్గ అసమర్థత వల్లే అసంపూర్తిగా 'గౌరవెల్లి'



సమావేశంలో మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

ధర్మసాగర్ (వేలేరు) : పాలకవర్గ అసమర్థత వల్లే గౌరవెల్లి ప్రాజెక్ట్ అసంపూర్తిగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విమర్శించారు. మండలంలోని పీచర గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని రాయితీల రూపంలో ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు భూపంపిణీ, తదితర అనేక హామీలు గుప్పించి తదనంతరం విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి కాకపోవడం వల్ల వేలేరు మండల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రజాసమస్యలను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను, రైతులను సమీకరించి పాలకులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఐక్యపోరాటాలు నిర్మిస్తామని భిక్షపతి హెచ్చరించారు. అనంతరం ఆ పార్టీ మండల కమిటీని కార్యదర్శిగా గడ్డమీది శంకరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, నాయకులు దామెర నరేష్, దార రాజు, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.